నమస్తే తెలంగాణ
కామారెడ్డి
5 | నిజామాబాద్, గురువారం 14 మార్చి 2024 | KAMAREDDY

## గుర్రాల సరోజనమ్మకు ఉత్తమ మహిళా అవార్డు



బోధన్, మార్చి 13: బోధన్ పట్టణానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయురాలు గుర్రాల సరోజనమ్మకు రాష్ట్ర ప్రభుత్వం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఉత్తమ మహిళా అవార్డు ప్రకటించింది. గురువారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా సరోజనమ్మ అవార్డును అందుకోనున్నారు. మరణానంతరం తన ఆస్తిని సామాజిక సేవా కార్యక్రమాల కోసం, తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్‌కు ఆమె విరాళంగా ఇచ్చారు.

**రంజాన్ వేళలు**

గురువారం
ఇఫ్తార్ - 6:34

శుక్రవారం
సహర్ - 5:14







ఉమ్మడి జిల్లాల ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు మాజీ ఎమ్మెల్యేలు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. బిగాల గణేశ్ గుప్తా, బాజిరెడ్డి గోవర్ధన్, ఆశన్నగారి జీవన్‌రెడ్డి బుధవారం హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.
– ఖలీల్‌వాడి, మార్చి 13

భార్యను చంపి ఆత్మహత్య చేసుకున్న ఆటోడ్రైవర్
ఆటో నడవడం లేదన్న బాధతోనే అఘాయిత్యం
నిజామాబాద్ నగరంలో ఘటన
తల్లిదండ్రులను కోల్పోయి ఒంటరైన కుమారుడు

# విషాదం..

## కుటుంబాన్ని అతలాకుతలం చేసిన ఫ్రీ బస్సు పథకం



రోదిస్తున్న కుమారుడు మల్లికార్జున్

**నిజామాబాద్** జిల్లా కేంద్రంలో తీవ్ర విషాదం నెలకొంది. ఆటో సరిగా నడవడం లేదని తీవ్ర మనస్తాపానికి గురైన ఓ ఆటోడ్రైవర్ తన భార్యను హత్య చేసి, ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రేవంత్‌రెడ్డి తెచ్చిన ఉచిత బస్సు ప్రయాణం కారణంగానే తన ఆటో నడవడం లేదని.. పొట్ట, బట్టకు కష్టంగా మారిందని తన మరణ వాంగ్మూలంలో పేర్కొన్నాడు. బుధవారం నగరంలో చోటు చేసుకున్న ఈ ఘటన రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఆటోవాలాల దుర్భర జీవితాలను కళ్లకు కట్టింది.

### ఇల్లాలిని చంపి..

కుటుంబం గడవడమే కష్టంగా మారడంతో స్వామి బుధవారం తీవ్ర నిర్ణయం తీసుకున్నాడు. తన భార్యను గొంతు పిసికి తాను ఆత్మహత్య చేసుకున్నాడు. తన చావుకు కారణాలేమిటో అంతకు ముందే తన ఫోన్‌లో వాయిస్ రికార్డింగ్ చేసి పెట్టాడు. ఇంటర్ పరీక్షలు పూర్తికావడంతో ఇంటికి వచ్చిన కుమారుడు మల్లికార్జున్ తలుపులకు లోపలి నుంచి గడియ పెట్టి ఉండడంతో కిటికీలోంచి చూడగా తల్లిదండ్రులు నిర్జీవంగా కనిపించారు. దీంతో కుప్పకూలిపోయిన బాబు ఏడుపులు విని స్థానికులు అక్కడకు చేరుకుని పోలీసులు సమాచారమిచ్చారు. సీఐ సతీశ్‌కుమార్, పోలీసులు వచ్చి వివరాలు సేకరించిన అనంతరం మృతదేహాలను పోస్టుమార్టం కోసం తరలించారు. తల్లిదండ్రులను కోల్పోయిన మల్లికార్జున్ గుండెలవిసేలా రోదించాడు. ఇది చూసిన స్థానికులు సైతం కన్నీటి పర్యంతమయ్యారు.

### ఆటో నడువకనే..

ప్రభుత్వం తీసుకొచ్చిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకంతోని తన ఆటో నడవడం లేదని స్వామి మరణ వాంగ్మూలంలో వెల్లడించాడు. 'నా ఆటో నడుస్తలేదు. రేవంత్ రెడ్డి తెచ్చిన ఉచిత బస్సు ప్రయాణంతోని ఆటో నడుస్తలేదు. ఆ మనస్తాపంతోనే చచ్చిపోతున్నానని' వాయిస్ రికార్డింగ్‌లో పేర్కొన్నాడు. ఎంత మంచిగా అయిదామన్నా అయిత లేదని ఆవేదనకు గురయ్యాడు.

వినాయక్ నగర్, మార్చి 13: 'మహిళలకు ఉచిత బస్సు పథకం' ఆటోవాలాలకు శాపంగా మారింది. ఆటోను నమ్ముకుని పొట్ట పోసుకుంటున్న కుటుంబాలను తీవ్రంగా దెబ్బకొట్టింది. ఉపాధి దూరమై, బతుకు భారమై ఆటోడ్రైవర్ల జీవనం దుర్భరంగా తయారైంది. దీంతో మనస్తాపానికి గురైన ఓ ఆటోడ్రైవర్ తన భార్యను చంపి, తానూ బలవన్మరణానికి పాల్పడ్డాడు. రేవంత్‌రెడ్డి తెచ్చిన ఉచిత బస్సు ప్రయాణంతో తన ఆటో నడవడం లేదన్న మనస్తాపంతోనే తాను ఈ ఘాతుకానికి పాల్పడినట్లు సదరు వ్యక్తి తన సెల్‌ఫోన్‌లో చేసిన వాయిస్ రికార్డింగ్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఆటోడ్రైవర్లను ఏ విధంగా దెబ్బతీసిందన్న అంశం ప్రస్తుతం అంతటా చర్చనీయాంశమైంది.

**ఆగమైన బతుకులు..**

నగరంలోని ఖిల్లా సమీపంలో గల కెనాల్ కట్ట ప్రాంతానికి చెందిన గోర్మిల స్వామి (45)కి భార్య దేవలక్ష్మి (40), కుమారుడు మల్లికార్జున్ ఉన్నారు. కుమారుడు డిచ్‌పల్లి మండలం బీబీపూర్ తండాలో గల మోడల్ కాలేజీలో ఇంటర్ చదువుతున్నాడు. ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తూ ఆనందంగా జీవిస్తున్న స్వామికి.. కాంగ్రెస్ తెచ్చిన మహిళలకు ఉచిత బస్సు పథకం శరాఘాతంగా మారింది. మూడు నెలలుగా ఆటోలు సరిగా నడవక పోవడంతో కుటుంబ పోషణ భారంగా మారింది. ఆటో కొనేందుకు తెచ్చిన అప్పుకు సంబంధించిన కిస్తీలు కట్టే పరిస్థితి లేకపోవడంతో మానసికంగా వేదనకు గురయ్యాడు.





మృతులు స్వామి, దేవలక్ష్మి (ఫైల్)

### భార్యను విడువలేక..

'నా భార్య నా కష్టసుఖాలలో పాలు పంచుకుంది. భర్త లేని ఆడదాని జీవితం వ్యర్థం. అందుకే ఆమెను ఒక్కదాన్ని విడిచి వెళ్లలేక ఆలోచించి, ఆలోచించి ఈ నిర్ణయం తీసుకున్న. నా భార్యను నేనే చేతులారా చంపుకున్న. ఇందులో ఎవ్వరి ఒత్తిడి లేదని' స్వామి తెలిపాడు. 'నా కొడుకు మల్లికార్జున్ ఇప్పుడు ఒంటరివాడైండు. వాడ్ని జాగ్రత్తగా చూస్కోండి. అత్త, మామ, అక్క, పిల్లలు వాడ్ని జాగ్రత్తగా కాపాడుండ్రి. సుధా చెల్లె. నన్ను క్షమించు. మీ వదినను కూడా నేనే తీసుకెళ్తున్న. నా కొడుకును మంచిగా చూడు చెల్లె' అని వాయిస్ రికార్డింగ్‌లో పేర్కొన్నాడు.

### కుమారుడితో మాట్లాడకుండానే..

బలవన్మరణానికి ముందు స్వామి తన కుమారుడితో మాట్లాడాలని తపించాడు. ఉదయం నుంచి తన కుమారుడి ఫోన్ కోసం ఎదురుచూసినట్లు రికార్డింగ్‌లో పేర్కొన్నాడు. 'నన్ను క్షమించు నాన్న. నీ ఫోన్ కోసం ఇయ్యాల పొద్దుగాల నుంచి చూస్తున్న. ఎగ్జామ్ అయినంక అయిన ఎవరి ఫోన్‌తోనైన చేస్తావని చూసిన. ఫోన్ చేయకపోతివి. జాగ్రత్త నాన్న' అని స్వామి అన్న మాటలు విన్న వారిని కంటతడి పెట్టించాయి. తమ చావు, దినాలకు ఎవరి దగ్గర చందాలు వసూలు చేయొద్దని, తన భార్య నగలు అమ్మి అంత్యక్రియలు చేయాలని స్వామి కోరాడు. మా ఇద్దరికి శవాలను ఒకటే స్వర్గరథంలో తీసుకెళ్లాలని, కుమారుడితోనే తలకొరివి పెట్టించాలని పేర్కొన్నాడు. తన కొడుకు ఎవరి దగ్గర ఉంటానంటే వారి దగ్గర ఉంచుకుని పోషించాలని, ఇందుకోసం అవసరమైతే తన ప్లాట్‌ను తీసుకోవాలని తెలిపాడు.

మూడు నెలలుగా ఆటో నడువక స్వామి తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నట్లు ఆయన బావమరిది మధు తెలిపారు. ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించే వాడని, కానీ ఉచిత బస్సు కారణంగా ఉపాధి దూరమైందన్నారు. ఈ విషయం గురించి ఎన్నోసార్లు తనకు చెప్పి బాధ పడ్డాడని మధు వివరించారు. పొట్ట, బట్టకు కష్టమైతుందన్న బాధతోని అక్క, బావలు మనస్తాపానికి గురయ్యారని తెలిపారు. స్వామి తమ్ముడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం కోసం తరలించారు.

## ఉద్యోగాల భర్తీకి ధరఖాస్తు చేసుకోవాలి

కామారెడ్డి, మార్చి 13: కామారెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాలలో ఒప్పంద ప్రాతిపదికన (కాంట్రాక్ట్) గౌరవ వేతనం పద్ధతిలో ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా.పి.వెంకటేశ్వర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 9 మంది ప్రొఫెసర్లు,15 మంది అసోసియేట్ ప్రొఫెసర్లు,15 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు,15 మంది సీనియర్ రెసిడెంట్స్ పోస్టుల కోసం ఈ నెల 15న ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రభుత్వ వైద్య కళాశాలలో ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు 2025 మార్చి 31వరకు కామారెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాల, జిల్లా ప్రధాన దవాఖానలో పనిచేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 15న నిర్వహించే ఇంటర్వ్యూకు విద్యార్హతలు, కుల,నివాస ఇతర ధ్రువీకరణ పత్రాలు, ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు. ఇతర వివరాలకు www.gmc.kamareddy.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని తెలిపారు.

## బాన్సువాడ ఆర్డీవోగా రమేశ్ రాథోడ్

బాన్సువాడ, మార్చి 13 :బాన్సువాడ ఆర్డీవో వి.భుజంగరావ్‌ను బదిలీ చేస్తూ బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. ఆదిలాబాద్ జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారిగా విధులు నిర్వహిస్తున్న రమేశ్‌రాథోడ్‌ను బాన్సువాడ ఆర్డీవోగా నియమించారు. భుజంగరావ్‌ను నిర్మల్ జిల్లా ప్రత్యేక (ల్యాండ్ అండ్ అడ్మినిస్ట్రేషన్) డిప్యూటీ కలెక్టర్‌గా నియమించింది.

## ఉపాధ్యాయుడికి ప్రధాని అభినందన

కామారెడ్డి రూరల్ , మార్చి 13: కామారెడ్డి మండలం చిన్నమల్లారెడి బాలుర ఉన్నత పాఠశాలలో భౌతిక రసాయన శాస్త్రం బోధిస్తున్న ప్రవీణ్ కుమార్‌కు ప్రధాని నరేంద్రమోదీ నుంచి అభినందన పత్రం అందినట్లు హెచ్ఎం సాయిరెడ్డి తెలిపారు. గతంలో ప్రధాని ఆన్‌లైన్‌లో చేపట్టిన పరీక్షా పే చర్చ అనే కార్యక్రమంలో ప్రవీణ్ కుమార్ పాల్గొని సూచనలు, సలహాలు అందించినందుకు అభినందన పత్రం వచ్చినట్లు పేర్కొన్నారు.

## డీఎస్సీకి ఉచిత శిక్షణ

కామారెడ్డి, మార్చి 13: ఉపాధ్యాయ పోస్టుల కోసం డీఎస్సీకి సన్నద్ధమయ్యే షెడ్యూల్డ్ కులాల అభ్యర్థులకు ఎస్సీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో రెండు నెలల పాటు ఉచితశిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా అధికారి రజిత బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డైట్, బీఎడ్, టెట్ అర్హత కలిగిన వంద మంది అభ్యర్థులకు ఏప్రిల్ 5 నుంచి జూన్ 16వ తేదీ వరకు నిజామాబాద్ జిల్లా కేంద్రంలో కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల అభ్యర్థులకు ఉచిత రెసిడెన్షియల్ కోచింగ్ ఇస్తామని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 26 వరకు www.tsstudycircle.com.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

ఖరారు చేసిన పార్టీ అధినేత కేసీఆర్
రెండుస్థానాల్లోనూ బీసీలకే పెద్దపీట
నిజామాబాద్‌కు బాజిరెడ్డి గోవర్ధన్

# బీఆర్ఎస్ అభ్యర్థిగా గాలి అనిల్ కుమార్




బాజిరెడ్డి గోవర్ధన్



గాలి అనిల్‌కుమార్

## పార్లమెంట్ ఎన్నికల అభ్యర్థుల ప్రకటన



నిజామాబాద్, మార్చి 13(నమస్తే తెలంగాణ ప్రతినిధి): నిజామాబాద్, జహీరాబాద్ లోక్‌సభ స్థానాలకు బీఆర్ఎస్ అభ్యర్థులను గులాబీ బాస్ కేసీఆర్ ప్రకటించారు. నిజామాబాద్ నుంచి బాజిరెడ్డి గోవర్ధన్, జహీరాబాద్ నుంచి గాలి అనిల్ కుమార్ పేర్లను ఖరారు చేశారు. నిజామాబాద్ జిల్లాలో బాజిరెడ్డి గోవర్ధన్ పరిచయం అక్కర్లేని వ్యక్తి. నిజామాబాద్ జిల్లాలోని ఐదు నియోజకవర్గాలు, జగిత్యాల జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లోనూ బాజిరెడ్డికి పట్టున్నది. గతంలోనూ ఆర్మూర్, బాన్సువాడ నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలుపొందారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం నుంచి 2014, 2018లో వరుసగా విజయం సాధించారు. ఆర్టీసీ చైర్మన్‌గా పనిచేసి సంస్థకు పేరు ప్రఖ్యాతులు తీసుకువచ్చారు. మాస్‌లీడర్‌గా, ప్రజల నాయకుడిగా గుర్తింపు పొందిన బాజిరెడ్డికి బీఆర్ఎస్ టికెట్ కేటాయింపుతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతున్నది. మరోవైపు కామారెడ్డి జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలకు ప్రాతినిధ్యం ఉండే జహీరాబాద్ నియోజకవర్గానికి ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన గాలి అనిల్ కుమార్ పేరును కేసీఆర్ ఖరారు చేశారు. గతంలో ఇదే ప్రాంతం నుంచి పలు ఎన్నికల్లో గాలి అనిల్ కుమార్ పోటీ చేయడం ద్వారా స్థానిక ప్రజానీకానికి సుపరిచితమే.

**బీసీలకు పెద్దపీట...**

బడుగు, బలహీనవర్గాలకు కేసీఆర్ నేతృత్వంలోని సర్కారు ఎంతో కృషి చేసింది. ప్రభుత్వంలో, పార్టీలో ఎంతో ప్రాముఖ్యతను అందించి విలువైన పథకాలను తీసుకువచ్చింది. రాజకీయ అవకాశాలను కల్పించడంతో పాటు ఆయా వర్గాల వారిని అన్ని రంగాల్లోనూ ముందుకు తీసుకువచ్చింది. అసెంబ్లీ ఎన్నికల్లో బీసీలకు అత్యధిక స్థానాలను కట్టబెట్టినట్లే లోక్‌సభ పోరులోనూ అదే ఒరవడిని కేసీఆర్ కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగా నిజామాబాద్, జహీరాబాద్ లోక్‌సభ స్థానాలకు ఖరారైన అభ్యర్థులు ఇరువురు బీసీ వర్గానికి చెందిన వారు కావడం ప్రాధాన్యతను సంతరించుకున్నది. బలహీనవర్గాలకు చెందిన వారికి రాజకీయ అవకాశాలను కల్పిస్తూ కేసీఆర్ తీసుకున్న నిర్ణయాన్ని అందరూ స్వాగతిస్తున్నారు. మున్నూరు కాపు సామాజిక వర్గానికి చెందిన ఇరువురు నేతలు జరుగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బరిలో నిలుస్తుండడంతో బీజేపీ, కాంగ్రెస్ పార్టీకి చెందిన వారంతా ఉలిక్కిపడాల్సి వస్తోంది. ఇప్పటికే నిజామాబాద్‌కు బీజేపీ అభ్యర్థిగా సిట్టింగ్ ఎంపీ అర్వింద్ పేరు ఖరారైంది. జహీరాబాద్‌కు బీఆర్ఎస్ నుంచి గత ఎన్నికల్లో ఎంపీగా గెలిచిన బీబీపాటిల్‌కు బీజేపీ టికెట్ ఇచ్చింది. కాంగ్రెస్ నుంచి జహీరాబాద్‌కు సురేశ్ షెట్కార్ పేరును ఖరారు చేసింది. నిజామాబాద్‌కు ఇంకా అభ్యర్థుల వెతుకులాటలోనే మునిగి తేలుతోంది. బీజేపీకి అభ్యర్థులు లేకపోవడంతో బీఆర్ఎస్‌కు చెందిన కీలకనేతలను లాక్కొని కండువా కప్పి టికెట్లు ఇచ్చే దౌర్భాగ్యం ఉండగా కాంగ్రెస్‌కు సరైన లీడర్లే దొరకడం లేదు. ఇప్పుడీ పరిస్థితిలో బలమైన బీసీ వర్గానికి చెందిన లీడర్లను పార్లమెంట్ ఎన్నికల్లో కేసీఆర్ నిలబెడుతుండడంతో నిజామాబాద్, జహీరాబాద్ లోక్‌సభ స్థానాల్లో చర్చనీయాంశమైంది. గెలుపు అవకాశాలు మెండుగా ఉండడంతో గులాబీ సైన్యం సంపూర్ణ సమన్వయంతో కలిసి పనిచేసేందుకు రెడీ అవుతున్నది.

## పురాతన బురుజులను పరిశీలించిన కలెక్టర్



బురుజులను పరిశీలిస్తున్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

మద్నూర్, మార్చి 13: మండలకేంద్రంలోని పురాతన బురుజులను కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ బుధవారం పరిశీలించారు. వానకాలంలో బురుజులు కూలితే చుట్టుపక్కల వారికి ప్రమాదం ఉన్నదని గతంలో కొందరు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ వాటిని పరిశీలించి, ఎవరికీ ఇబ్బందులు లేకుండా కూల్చేయాలని పంచాయతీ అధికారులకు సూచించారు. నెలరోజుల్లోనే కూల్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ ముజీబ్, పంచాయతీ ప్రత్యేకాధికారి డాక్టర్ విజయ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి సందీప్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్ చంద్రకాంత్, సిబ్బంది ఉన్నారు.





## ఎన్‌సీఎస్‌ఎఫ్ పునఃప్రారంభానికి కృషిచేస్తా..

రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి
కలెక్టర్‌తో కలిసి ఫ్యాక్టరీని సందర్శించిన ఎమ్మెల్యే



పరిశీలిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే, మాట్లాడుతున్న ఎమ్మెల్యే, కలెక్టర్

సారంగాపూర్, మార్చి 13: సారంగాపూర్‌లోని నిజామాబాద్ సహకార చక్కెర కర్మాగారాన్ని రూరల్ ఎమ్మెల్యే ఆర్. భూపతిరెడ్డి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు బుధవారం సందర్శించారు. ఈ ఫ్యాక్టరీలోని యంత్రాలను, స్థలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులు, రైతు నాయకులతో భేటీ అయ్యారు. 2008–09 సీజన్ నుంచి మూతబడిన సహకార చక్కెర ఫ్యాక్టరీని ప్రభుత్వం సహకార రంగంలోనే కొనసాగించాలని రైతు ప్రతినిధులు కోరారు. ప్రభుత్వం తోడ్పాటునందిస్తే ఫ్యాక్టరీ పరిధిలోని రైతులు చెరుకు పంట పండించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూపతిరెడ్డి మాట్లాడుతూ నిజాంషుగర్ ఫ్యాక్టరీలను పునరుద్ధరించేందుకు ప్రభుత్వం మంత్రి శ్రీధర్ బాబు అధ్యక్షతన సబ్‌కమిటీని ఏర్పాటు చేసిందని గుర్తుచేశారు. తాను నిజామాబాద్ సహకార చక్కెర ఫ్యాక్టరీని సైతం పునరుద్ధరించాలని సబ్‌కమిటీతోపాటు సీఎంను కూడా కోరామన్నారు. దీంతో ఎన్‌సీఎస్‌ఎఫ్ స్థితిగతులపై నివేదిక అందించాల్సిందిగా జిల్లా యంత్రాంగాన్ని ప్రభుత్వం ఆదేశించినట్లు తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కర్మాగారాన్ని ప్రైవేట్‌పరం చేయబోమని, ఫ్యాక్టరీ నిర్వహణపై ప్రభుత్వం సహేతుక నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు మాట్లాడుతూ రైతుల అభిప్రాయాలతో కూడిన సమగ్ర నివేదికను వారం రోజుల్లో ప్రభుత్వానికి సమర్పిస్తామన్నారు. ఎన్‌సీఎస్‌ఎఫ్‌కు చెందిన పూర్తి వివరాలను రెండు రోజుల్లో తనకు నివేదించాలని ఇన్‌చార్జి ఎండీ రవిని ఆదేశించారు. వారి వెంట నిజామాబాద్, బోధన్ ఆర్డీవోలు రాజేంద్రకుమార్, శ్రీరాందత్తు, అఖిల భారత చెరుకు విభాగం కన్వీనర్ కొండెల సాయిరెడ్డి, చెరుకు ఉత్పత్తిదారుల సంఘం ప్రతినిధులు ఆకుల పాపయ్య, వేల్పూర్ భూమయ్య, బొడ్డు గంగారెడ్డి తదితరులు ఉన్నారు.